ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 26.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎమ్: 9985411154



ప్రత్యేక అలంకరణలో రాధా పార్థసారథులు, ప్రభుపాదుల స్వామికి ఫల పంచామృతాభిషేకాలు

ఘనంగా ప్రభుపాదుల ఆవిర్భావోత్సవం

- ఇస్కాన్‌లో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సంస్థాపకాచార్యులు భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ మందిరంలో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. శ్రీల ప్రభుపాదులస్వామి ఆవిర్భావోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం ఆయన ఉత్సవమూర్తికి వేదమంత్రోచ్ఛారణల నడుమ వివిధరకాల సుగంధ ద్రవ్యాలు, నదీజలాలు, పండ్లరసాలతో అభిషేకించారు. అనంతరం రాధాపార్థసారధులకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు, దశహారతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, సిబ్బంది పాల్గొన్నారు.



భారీ జన సందోహం మధ్య స్వామి వారి రథోత్సవం

వైభవంగా అంజన్న రథోత్సవం

బొమ్మనహాళ్, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం భారీ జనసందోహం మధ్య అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజామున గంగాజలం తెచ్చి స్వామికి అభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఊరేగించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.. రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు.

ఉపాధ్యాయ నియామకాలకు అడుగులు

- ఇప్పటికే ఫలితాలు విడుదల • నేడో.. రేపో మెరిట్ లిస్ట్

- రాజధానికి జిల్లా విద్యాశాఖ అధికారులు
- దరఖాస్తుల పరిశీలనకు 16 కమిటీలు
- కటాఫ్‌పై అభ్యర్థుల్లో టెన్షన్

అనంతపురం విద్య, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే అభ్యర్థుల వ్యక్తిగత ఫలితాలను విడుదల చేసింది. జిల్లా, పోస్టుల వారీగా మెరిట్ లిస్ట్ విడుదల కావాల్సి ఉంది. టెట్ మార్కుల నమోదులో తప్పులు చేయడం, రిజర్వేషన్లపై కోర్టుకు కొందరు వెళ్లడంతో ఇతర ప్రక్రియ కొంత ఆలస్యమవుతూ వచ్చింది. న్యాయస్థానం ఫలితాలకు ఆమోదం తెలపడంతో నియామకాలకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. దరఖాస్తుల పరిశీలనకు విద్యాశాఖ కమిటీలు ఏర్పాటు చేసింది. అధికారుల లెక్కల మేరకు.. జిల్లాలో డీఎస్సీ ద్వారా 807 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇందులో ఎస్ఏ తెలుగు 28, ఎస్ఏ ఉర్దూ 09, హిందీ 28, ఇంగ్లీష్ 103, మ్యాథ్స్ 43, ఫిజిక్స్ 66, బయాలజీ 72, సోషియల్ 110, సోషియల్ ఉర్దూ 01, పీడీ పోస్టులు 145, ఎస్జీటీ తెలుగు 147, ఎస్జీటీ ఉర్దూ 48, ఎస్జీటీ కన్నడ 07 పోస్టుల చొప్పున ఉన్నాయి. ఈ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పక్కాగా పరిశీలనకు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ, డిప్యూటీ తహసీల్దార్‌తో కమిటీలు నియమించారు. ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనకు మొత్తం 16 కమిటీలను విద్యాశాఖ నియమించింది.

• నేడు ఎంఈఓ, హెచ్ఎంల సమావేశం

జిల్లాలో యాజమాన్యాల వారిగా ప్రస్తుతం ఉన్న ఖాళీల వివరాలను సేకరించి వాటిపై స్పష్టత తీసుకుంటున్నారు. ఇప్పటికే డీఈఓ ప్రసాద్‌బాబు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ ముందస్తుగా ఏఏ పాఠశాలకు ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, అందులో ఏఏ కేడర్‌లో ఎంతమంది టీచర్లు పనిచేస్తున్నారు, ఎక్కడెక్కడ ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో సమాచారం సిద్ధం చేసుకున్నారు. వీటిపై ఎంఈఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పూర్తిగా ఖాళీలపై స్పష్టత తీసుకోవడానికి సోమవారం జిల్లా కేంద్రంలో ఎంఈఓలు, హెచ్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు.



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

• రాజధానికి విద్యాశాఖ అధికారులు

ఉపాధ్యాయ నియామకాల (మిగతా 7లో..)



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నాల్గవ వారం కావడంతో స్వామి దర్శనం కోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం, బంగారు కవచ అలంకరణ, ఆకుపూజ, అర్చన మహా నైవేద్యం, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం ధర్మవరం లలితకళానికేతన్ గురువులు బాబు బాలాజీ, రామలాలిత్య శిష్యబృందం 15 మంది చేత కూచిపూడి నాట్యం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బాబు, ప్రధాన అర్చకుడు రాముస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హై టెన్షన్..!

నేడు తాడిపత్రికి పెద్దారెడ్డి రాక

విగ్రహావిష్కరణకు మున్సిపల్ చైర్మన్ ఏర్పాట్లు

- భారీ సంఖ్యలో పోలీసు బలగాలు
- తాడిపత్రి ప్రజల్లో ఆందోళన
- మాజీ ఎమ్మెల్యేను అడ్డుకుని తీరుతాం: టీడీపీ శ్రేణులు



తాడిపత్రి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హైటెన్షన్. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి రావడానికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఐదు వాహనాలు, 40 మందితో సోమవారం ఆయన పట్టణానికి రావడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. అదే విషయంలో అనంతపురం రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటుచేసిన ధ్యానశివుని విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు ప్రజలు రావాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునివ్వడంతో సర్వత్రా టెన్షన్ నెలకొంది. దీంతో పోలీసులకు కంటి మీద కునుకు కరువైంది. తాడిపత్రిలో ఏమి జరుగుతుందోనన్న ఆందోళన, భయం ప్రజల్లో ఉంది. గతంలో పెద్దారెడ్డి పలుమార్లు కోర్టు అనుమతితో తాడిపత్రికి వచ్చేందుకు ప్రయత్నించినా జేసీ ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు అడ్డుకుని తీరుతామని హెచ్చరించడంతోపాటు ఆయన ఇంటివైపు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని, పోలీసులు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చిన వెంటనే ఆయనను వెనక్కి పంపిస్తూ వస్తున్నారు. దాదాపు 2024 ఎన్నికల సందర్భంగా తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో ఇరువర్గాలను ఊరి నుంచి మూడు నెలలపాటు బహిష్కరించారు. అనంతరం ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తర్వాత మూడునెలలకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తాడిపత్రికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాత్రం నేటికీ రాలేదు. పలుసార్లు రావాలని ప్రయత్నించినా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటూనే ఉన్నారు. ఈనేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించగా.. పోలీసులే స్వయంగా వెళ్లి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఇంటివద్దకు చేర్చాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం. శాంతిభద్రతల సమస్య ఉంటే అదనపు బలగాలను వినియోగించాలని స్పష్టం చేసినట్లు పలువురు చెబుతున్నారు. పోలీసులు మాత్రం పెద్దారెడ్డి రాక, శివుని విగ్రహావిష్కరణ రెండూ ఒకేరోజు ఉండడంతో ఎవరికీ చెప్పలేక సతమతమవుతున్నారు. ఇప్పటికే ఇరు నాయకులతో చర్చించినట్లు సమాచారం. తాడిపత్రికి వచ్చి తీరతానని పెద్దారెడ్డి పట్టుబట్టినట్లు తెలుస్తోంది. శివుని విగ్రహావిష్కరణ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి చేస్తారనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యక్రమం నిర్వహించి తీరుతామని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో పోలీసులు జుట్టు పీక్కుంటున్నారు. దీంతో దాదాపు 450మంది పోలీసులను రప్పిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో పట్టణ ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

నేటి నుంచి విధుల్లోకి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం విధుల్లో చేరనున్నారు. గత నెల 21 నుంచి ఈనెల 16వతేదీ వరకు ముస్సోరీలో మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగాం (ఎంసీటీపీ) శిక్షణ నిమిత్తం వెళ్లారు. అక్కడి నుంచి ఇప్పటికే బయలుదేరినట్లు తెలిసింది. సోమవారం కలెక్టర్ ప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు డీఆర్ఓ మలోల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం పడింది. డి.హిరేహాల్‌లో ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతపురం, కూడేరు, యాడికి, గుత్తి, గార్లదిన్నె, శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. శనివారం జిల్లాలోని 16 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా తాడిపత్రిలో 62.4 మి.మీ వర్షపాతం నమోదైంది. యాడికి 17.2 మి.మీ., వజ్రకరూరు 12.2, గుత్తి 10.2, పెద్దపప్పూరు 6.0, పామిడి 5.4, విడపనకల్లు 5.2, కంబదూరు 4.8, యల్లనూరు, బుక్కరాయసముద్రం 3.2, పెద్దవడుగూరు 2.2, గుంతకల్లు 1.8, కళ్యాణదుర్గం 1.6, ఉరవకొండ 1.2, కణేకల్లు, ఆత్మకూరు 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఫోన్‌లో ఉగ్ర గుట్టు..!

నూర్ మహమ్మద్ మొబైల్‌లో వివరాలు బయటపడే అవకాశం

- ఉగ్రసంస్థ పిలిస్తే శిక్షణకు రెడీ
- అజ్ఞాతంలోకి నూర్ ప్రియురాలు
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు
- జిల్లాపై పూర్తి నిఘా

పుట్టపర్తి/ధర్మవరం/హిందూపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు నెరిపిన కొత్వాల్ నూర్ మహమ్మద్ అరెస్టుతో జిల్లాలో కలకలం రేగింది. అతడి ఫోన్‌ను ఫోరెన్సిక్‌కు పంపారు. అందులో ఉగ్ర లింకులు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ధర్మవరంలోని లోనికోట ప్రాంతానికి చెందిన నూర్ మహమ్మద్ పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద వాట్సాప్ గ్రూపుల్లో చురుగ్గా ఉంటూ ఉగ్రవాద భావజాలం, దేశవ్యతిరేక ప్రచారం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఉగ్రగ్రూపులతోపాటు పాకిస్థాన్ నిషేధిత వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసి, ప్రచురించి ధర్మవరంతోపాటు జిల్లాలోని పలు మసీదులు, ప్రార్థనా మందిరాల వద్ద యువతకు పంచిపెట్టినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఉగ్రవాద సంస్థలతో ఆర్థిక లావాదేవీలు సైతం సాగించినట్లు తెలుస్తోంది. ఇక్కడి సమాచారాన్ని ఉగ్రవాద సంస్థలకు చేరవేసేవాడని సమాచారం. ఏదైనా ఉగ్ర సంస్థ పిలిస్తే శిక్షణ ఇవ్వడానికి రెడీగా ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. నూర్ మహమ్మద్‌కు ఉగ్రవాద గ్రూపులతో సంబంధం ఎలా ఏర్పడింది, అందుకు ఎవరు సహకరించారు, ఉగ్రవాద గ్రూపుల నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న సమాచారాన్ని ఎవరెవరికి పంపించాడు అన్న కోణాల్లో పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఈనేపథ్యంలో కడప సెంట్రల్ జైలులో ఉన్న నూర్‌ను కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ధర్మవరంలో ఎర్రగుంటకు చెందిన రియాజ్ అనే యువకుడు పాకిస్థాన్ జాతీయ జెండాతోపాటు సయ్యద్ బిలాల్ వీడియోలను వాట్సాప్ స్టేటస్ పెట్టుకోవడాన్ని నిఘావర్గాలు గుర్తించాయి. శనివారం రియాజ్‌ను అదుపులోకి తీసుకుని, విచారించి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. ధర్మవరంతోపాటు హిందూపురం, కదిరి ప్రాంతాల్లో ఇలాంటి వాట్సాప్ స్టేటస్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఓవైపు నూర్ మహమ్మద్ ఉగ్రలింకులపై దర్యాప్తు చేస్తూనూ.. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఉగ్రకదలికలపై పోలీసు యంత్రాగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లాలో అనుమానం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టారు.



ప్రియురాలితో వీడియో కాల్ మాట్లాడుతున్న నూర్ మహమ్మద్

మొబైల్‌లో ఉగ్రలింకుల గుట్టు

నూర్ మహమ్మద్ నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్‌లో ఉగ్రలింకుల గుట్టు వెల్లడికానుందని పోలీసులు భావిస్తున్నారు. ఆరు ఉగ్రవాద సంస్థలు, 30 పాకిస్థాన్ (మిగతా 7లో..)

1,568 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1568 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువులను ఏడీఏ పరిశీలించారు. జిల్లాకు యూరియా 600 మెట్రిక్ టన్నులు, డీఏపీ 178, 20-20-0-13 రకం ఎరువులు 511, 10-26-26 రకం ఎరువులు 279 మెట్రిక్ టన్నులు వచ్చాయని వివరించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

రక్తమోడిన రోడ్లు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

7లో

ఆయకట్టుకు సమృద్ధిగా నీరిస్తాం: కాలవ



మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం క్రస్ట్‌గేట్లకు సంబంధించి ఎలాంటి ముప్పు లేదని, హెచ్చెల్సీ ఆయకట్టుకు ఈ ఏడాది సమృద్ధిగా నీళ్ల అందుతాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. ఆయన ఆదివారం హెచ్చెల్సీపై విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక మంత్రి తంగెడె రెండు పంటలకు నీరందించే సందర్భంలో మాట్లాడుతూ.. డ్యాంకు సంబంధించిన ఏడు గేట్లు వంకర అయ్యాయని చెప్పారు. కానీ 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ అంత మోతాదులో నిలువ చేయకూడదని నిపుణులు సూచన మేరకు 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తున్నారన్నారు. 80 టీఎంసీలకు పైబడి వచ్చిన నీరంతా బోర్డు అధికారులు నదికి వదులుతున్నారన్నారు. ఇప్పటికిపుడు ఈ ఏడాది డ్యాంకు ఆ గేట్ల నుంచి ఎలాంటి ప్రమాదం వాటిల్లదని అధికారులు స్పష్టం చేశారన్నారు. హెచ్చెల్సీకి 24 టీఎంసీలు కేటాయింపులు ఉన్నాయన్నారు. వీటితో పాటు కేసీ కెనాల్ వాటా నీటిలో కొంత జలాలను తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


బండి అక్కులన్న (ఫైల్)

కనగానపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతానికి ఓ రైతు బలయ్యాడు. గ్రామానికి చెందిన బండి అక్కులన్న(56) అనే రైతు వరి పంట వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాడు. ఈ క్రమంలో పొలానికి నీరు పెట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన విద్యుత్ తీగలను వ్యవసాయ బోరుబావి వైర్‌కు తగిలిస్తుండగా విద్యుత్ షాక్ గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. అటుగా వెళుతున్న రైతులు అక్కడికి వచ్చి తీగలను పక్కకి తీసి చూడగా అక్కులన్న అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య నరసమ్మతో పాటు నాగేంద్ర అనే కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ వైరు దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న విద్యుత్ వైర్లను చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వైర్లను దొంగలిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ నర్సింగరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా ఆర్డీఎస్ఎస్ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను కత్తిరించి దుండగులు అమ్ముకుంటుండగా ఆదివారం వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఆదిల్‌బాషా, పఠాన్ షబ్బీర్, జమీర్, పఠాన్ జిలానీఖాన్, పఠాని భక్తర్ నిర్మాణదశలో ఉన్న పోల్ నుంచి విద్యుత్ వైర్లను అమ్ముకోవడం ప్రారంభించారన్నారు. మండలంలోని రెండుచోట్ల 800 కిలోలు 40 స్తంభాల విద్యుత్‌వైర దొంగలించారన్నారు. రొద్దం మండలంలో రెండుచోట్ల 800 కిలోలు, పెనుకొండ మండలంలో 1500 కిలోల వైర్లు వాటితోపాటు తరలించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ట్రైనీ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటోలో నగల చోరీ

గోరంట్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన శాంతమ్మ ఆటోలో ప్రయాణిస్తుండగా ఆదివారం రాత్రి దాదాపు ఏడు తులాల బంగారం నగల చోరీ అయ్యాయి. బాధితురాలు తెలిపిన మేరకు.. చిక్‌బళ్లాపూర్‌లోని కుమార్తె నిర్వహిస్తున్న వరలక్ష్మీ వ్రతంలో శుక్రవారం పాల్గొనడానికి నగలు తీసుకెళ్లి పూర్తి అయిన తరువాత తిరిగి వస్తుండగా నగలు చోరీ అయ్యాయి. చిక్‌బళ్లాపూర్‌నుంచి బాగేపల్లివద్ద టీబీ క్రాస్ వద్ద దిగి ఆటోలో గోరంట్లకు వస్తుండగా సంఘటన చోటుచేసుకుంది. టీబీ క్రాస్ వద్ద శాంతమ్మ ఆటోలో బయలుదేరిన సమయంలో మరో ముగ్గురు మహిళలు ఎక్కి గోరంట్లలోని మోర్ మార్కెట్‌వద్ద దిగారు. శాంతమ్మ ఇంటికెళ్లి హ్యాండ్ బ్యాగులోని నగలు చూసుకోగా, నెక్లెస్, లాంగ్ చైన్, మరో చైన్ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

అక్కా.. నే చనిపోవాలనుకుంటున్నా!

- ఐదు రోజుల కిందట ఫోన్ చేసిన మనోజ్
- ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు సోదరి ఫిర్యాదు


మనోజ్‌కుమార్

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'అక్కా, నేను తిరుపతి బస్టాండు వద్ద ఉన్నా. నా వల్ల మీరు అప్పులపాలయ్యారు. అందుకని నేను చనిపోవాలనుకుంటున్నా' అని ఈనెల 12వ తేది ఉదయం 6.30 గంటలకు ఎం.మనోజ్ కుమార్ ఫోను చేశారు. ఆ తర్వాత ఫోను స్విచ్ ఆఫ్ అయింది. అప్పట్నుంచి వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆదివారం తిరుపతి పోలీసులకు నాగపావని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎం.మనోజ్‌కుమార్‌ది అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన పామిడి గ్రామం. ఇంటి వద్దే ఉంటున్నారు. షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈనెల పదో తేది ఉదయం 9 గంటలకు ఫోనుచేసి రైలులో తిరుపతికి వెళ్లొస్తానని బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుమల కొండకి వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరుపతికి వచ్చారు. 12వ తేది ఉదయం 6.30 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని సోదరి నాగపావనికి ఫోనుచేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పి స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళన చెందారు. 'మేమంతా తిరుపతికి వచ్చి పరిసర ప్రాంతాల్లో వెదికాం. ఎక్కడా మా తమ్ముడి ఆచూకీ తెలియ రాలేదు. మా స్నేహితులు, బంధువులకు చెప్పి వెతకాలని చెప్పాం. ఎంతకీ ఆచూకీ తెలియరాలేదు' అంటూ నాగపావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు మొబైల్ రిపేరీ, స్వయం ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అధిక నాణ్యతగల సాంకేతికత, సౌకర్యాలతో మొబైల్, సెల్‌ఫోన్‌ల రిపేరీ, సేల్‌లో నాణ్యమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లలో శిక్షణ 45 రోజుల పాటు ఇస్తారన్నారు. ఎలక్ట్రికల్ శిక్షణతో పాటు కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ వ్యక్తిత్వ వికాసంలలో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 25వతేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణ అనంతరం ఉచితంగా టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని, అన్నారు. 18-40 సంవత్సరాల వయస్సులోపు ఉన్న నిరుద్యోగ యువత ఐదో తరగతి, పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉన్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో మధ్యాహ్నభోజనం ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8885542201 7780752418లను సంప్రదించాలని కోరారు.

'ఆచారాలు-సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ

అనంతపురం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రచయిత ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన 'ఆచారాలు - సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ సభను ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సాహితీవేత్తలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు అనేక కోణాల్లో మనుషుల జీవితాలను ప్రభావితం చేస్తుంటాయన్నారు. వాటిలో కొన్ని శాస్త్రీయమైనవి, నమ్మదగినవి కాగా మరికొన్ని మూఢనమ్మకాలతో నిండి ఉంటాయని అన్నారు. ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన ఆచారాలు - సంప్రదాయాలు పుస్తకం చదివితే పాఠకులకు ఈ రెండింటి మధ్య తేడా స్పష్టంగా అవగతమవుతుందన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి తన్నీరు నాగేంద్ర, యోగేంద్ర నాయుడు, ప్రముఖులు తూముచర్ల రాజారామ్, విశ్వనాథ్ రెడ్డి, అనిత, అరుణకుమారి, కొత్తపల్లి సురేష్, మధురశ్రీ, ఎస్ఎన్ బాషా, పూజారి ఈరన్న, నర్సిరెడ్డి, వన్నప్ప పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఫోన్‌లో ఉగ్ర గుట్టు..!

(5వ పేజీ తరువాయి)

గ్రూపుల్లో నూర్ మహమ్మద్ చురుగ్గా ఉన్నట్లు పోలీసుల విచారణలో వెలుగుచూచింది. స్వాధీనం చేసుకున్న రెండు సిమ్‌కార్డులతోపాటు మొబైల్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మొబైల్‌తో ఎవరెవరికి కాల్ చేశారు, ఎక్కడెక్కడి నుంచి కాల్స్ వచ్చా యి, నూర్ యాక్టివ్‌గా ఉన్న ఉగ్ర గ్రూపుల అడ్మిన్లు ఎవరు, ఏమి సందేశాలు పంపారన్న అంశాలు ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలో వెల్లడికానున్నాయి. ధర్మవరంలో నూర్‌తో పాటు ఇంకా ఎవరెవరికి లిం కులు ఉన్నాయో వెల్లడయ్యే అవకాశాలున్నాయి. వారి భవిష్యత్తు కార్యాచరణ ఏమిటన్నది కూడా తెలియవచ్చని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

అక్కడే పరిచయం ఏర్పడిందా?

నూర్ మహమ్మద్ రెండేళ్ల క్రితం అన్నమయ్య, కడప జిల్లాల్లో నిర్వహించిన ఇజితిమా కార్యక్రమాలకు వెళ్లిన సమయంలో అక్కడ ఉగ్రవాదులతో సంబంధం ఉన్నవారు పరిచయమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పటి నుంచి ఉగ్రవా ద సంబంధాలున్న వారితో పరిచయాలు పెరగడం తో తరచూ ఫోన్, వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తుండేవాడని తెలిసింది. ఇలా ఉగ్ర సంస్థలతో పూర్తిగా మమేకమయ్యాడని భావిస్తున్నారు. స్థానికంగా మసీదుల వద్ద ముస్లిం యువతను.. ఉగ్రవాదం వైపు ప్రేరేపించేవాడని అనుమానిస్తున్నారు.

ప్రియురాలి కోసం ఆరా..

నూర్ మహమ్మద్ కొంతకాలంగా తాడిపత్రికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నడుపుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. దర్యాప్తు బృందాలు ఆ కోణంలో కూడా విచారణ చేపట్టాయి. అతడి ప్రియురాలి పూర్వాపరాల గురించి ఆరాతీస్తున్నట్లు తెలిసింది. ఆమెకు నిషేధిత ఉగ్రసంస్థలతో సంబంధాలున్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నాయి. నూర్‌మహమ్మద్ అరెస్టుతో ప్రియురాలు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. నూర్‌మహమ్మద్ తరచూ వాట్సాప్ కాల్ ద్వారా ప్రియురాలితో సంభాషించిన ఆధారాలను కుటుంబసభ్యులు బహిర్గతం చేశారు. దర్యాప్తు బృందాలు.. ఆమెను అదుపులోకి తీసుకుంటే మరిన్ని వివరాలు బయటపడే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

ధర్మవరంలో ఆందోళన

పట్టుచీరలకు పేరొందిన ధర్మవరంలో ఉగ్రకదలికలు బయటపడటంతో పట్టణ ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇలాంటి వారు ఇంకా ఎంతమంది ఉన్నారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చేనేత రంగం వృద్ధిచెందుతున్న తరుణంలో ఈ ఉగ్ర కదలికల ఉదంతం ఆ వ్యాపార రంగంపై ప్రభావం చూపవచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి ప్రత్యేక బృందాల ద్వారా మరింత లోతుగా దర్యాప్తు చేయించి ధర్మవరంలో ఉగ్రకదలికలు వెలికితీసి కఠినంగా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా నిఘా

నూర్ మహమ్మద్ అరెస్టుతో రాష్ట్ర నిఘా విభాగం ఉగ్ర మూలాలను జల్లెడ పట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అనుమానిత ప్రదేశాల్లో నిఘా ముమ్మరం చేసింది. జిల్లాలోని అనుమానిత ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా ఇటీవల కాలంలో వచ్చారా అనే దానిపై రహస్యంగా ఆరాతీస్తున్నారు. ఉగ్రవాద లింకులున్న వ్యక్తులు పట్టణాల్లో ఉంటూ వారిపై ఉగ్రవాద వల విసురుతున్నట్లు తెలుస్తుంది. జిల్లా సరిహద్దులో ఉన్న హిందూపురం, కదిరి, ధర్మవరం, మరికొన్ని పట్టణాల్లో స్థానిక పోలీసు అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బెంగళూరు దగ్గరగా ఉండటంతో ఈ ప్రాంతాల్లోకి వచ్చి కొన్నిరోజులపాటు స్థిరపడి బెంగళూరుపై గురిపెట్టే అవకాశాలు లేకపోలేదు. దీంతో జిల్లా సరిహద్దులో ఉన్న పోలీసు అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వేచ్ఛగా పాఠాలు చెప్పే పరిస్థితి లేదు

- ఎమ్మెల్సీ గోపీమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఉరవకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలు తెరచి రెండు నెలలవుతున్నా ఉపాధ్యాయులు క్లాసులకు వెళ్లి స్వేచ్ఛగా పాఠాలు చెప్పే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ గోపీమూర్తి ఆరోపించారు. ఉరవకొండ పట్టణంలో ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు మునుపు యూటీఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ.. యోగా డే, మెగా పేరెంట్స్ డే పేరుతో ప్రభుత్వం వారం రోజుల ముందు, తరువాత ఫొటోలు అప్‌డేట్ చేయమనడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు అనుగుణంగా జీఓలు సవరించారని తెలిపారు. గత ప్రభుత్వం పాఠశాలలు విలీనం చేయడం వల్ల ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గు చూపారని వివరించారు. రాష్ట్రంలో ఆఫీసర్స్ ఎడ్యుకేషన్ నడుస్తోందని అని అన్నారు. విద్యారంగాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ బడిని నిలుపుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం తమ భావజాలం నింపివేస్తూ చరిత్రను వక్రీకరించి, మార్చి పాఠ్యపుస్తకాలను చేస్తోందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, నాయకులు రామప్పచౌదరి, జయచంద్రారెడ్డి, రమణయ్య, గోవిందురాజులు, సుధాకర్, తిమ్మప్ప, వీరన్న, రాఘవేంద్ర పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.42

అనంతపురంరూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.42తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

ప్రశాంతతకు భంగం కలిగించే కుట్రలను సహించం

- మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరిక



ధర్మవవరంలో ప్రశాంతతకు భంగం కలిగించే కుట్రలను సహించమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. ధర్మవరంలో నూర్ మహమ్మద్ అరెస్టుపై మంత్రి ఆదివారం పట్టణంలో మాట్లాడుతూ.. కేంద్ర నిఘాసంస్థల ఆధారాలు, స్థానిక పోలీసుల అప్రమత్తతతో ఈ అరెస్టులు జరిగాయన్నారు. ఉగ్ర లింకుల్లో కుట్రకోణాన్ని కొట్టి పారేయలేమన్నారు. ధర్మవరంలో అలజడులు సృష్టించాలని ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాయన్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు నిఘాసంస్థల నివేదికల ద్వారా త్వరలో వెలుగులోకి వస్తాయనీ, ఊహాగానాలకు నమ్మవద్దని పట్టణ ప్రజలను మంత్రి కోరారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్లుగా అనంత జట్లు


విజేతలుగా నిలిచిన జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీ విజేతగా అనంతపురం జట్లు నిలిచాయి. గత నాలుగు రోజులుగా తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ రాష్ట్రస్థాయి చాంపియన్స్‌షిప్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో తూర్పుగోదావరిపై అనంతపురం బాలుర జట్టు, కృష్ణా జిల్లాపై అనంతపురం బాలికల జట్టు గెలుపొంది ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకున్నారు. డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి విజేత జట్లను అభినందించారు. రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ సాధించడం శుభపరిణామని తెలిపారు.

ఉపాధ్యాయ నియామకాలకు అడుగులు

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పలు ఆదేశాలు ఇస్తున్నారు. తాజాగా ప్రతి జిల్లా విద్యాశాఖ నుంచి డీఎస్సీ ప్రక్రియ చూసే సంబంధిత అధికారులను రాజధానికి రావాలని శనివారం ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ నుంచి డీఈఓతోపాటు ఇతర సెక్షన్, ఐటీసెల్ బృందం ఆదివారం బయలుదేరి వెళ్లింది.

● అభ్యర్థుల్లో కటాఫ్ టెన్షన్

అర్హత సాధించిన అభ్యర్థులకు కటాఫ్ టెన్షన్ పట్టుకుంది. ఇప్పటికే వ్యక్తిగతంగా అభ్యర్థుల ఫలితాలు విడుదల చేశారు. మెరిట్ ఆధారంగా జాబితా రావాల్సి ఉంది. ఆ జాబితా వస్తేగానీ ఏఏ కేడర్ పోస్టులకు ఎంత వరకు అత్యధిక మార్కులు వచ్చాయి, రోస్టర్ వారిగా ఏ పోస్టుకు ఎంతవరకు కటాఫ్ రావచ్చో తెలుస్తుంది. మరోవైపు ఈసారి ఒక్కో పోస్టుకు ఒకరినే ఎంపిక చేసి దరఖాస్తుల పరిశీలనకు పిలుస్తారని అంటున్నారు. డీఎస్సీలో ఒక అభ్యర్థే మోడల్ స్కూల్ టీజీటీ, పీజీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ పోస్టులకు పరీక్ష రాసి ఉంటారు. ఒక్కోసారి ఒకే అభ్యర్థి రెండు, మూడు పోస్టులకు అర్హత సాధించి ఉంటారు. ఒక్కో పోస్టుకు ఒక అభ్యర్థినే పిలుస్తారంటున్నారు. ఇది కూడా అభ్యర్థుల్లో గందరగోళం సృష్టిస్తోంది.

● మార్గదర్శకాలపై స్పష్టత వచ్చే అవకాశం

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు జరుగుతున్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రక్రియ చేపడుతున్నాం. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు ఏర్పాటు చేశాం. ఖాళీపై క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకుంటున్నాం. కమిషనర్ ఆదేశాల మేరకు రాజధానికి వెళుతున్నాం. నియామకాల ప్రక్రియ మార్గదర్శకాలపై అక్కడ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రక్తమోడిన రోడ్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి


నాగరాజు, మంజునాథ్ (ఫైల్)

కొత్తచెరువు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. కొత్తచెరువు మండలంలోని మైలేపల్లి వద్ద ధర్మవరం ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సీఐ మారుతీశంకర్ తెలిపిన మేరకు...ధర్మవరం పట్టణానికి చెందిన మంజునాథ్(22) ద్విచక్ర వాహనంలో కొత్తచెరువులో వివాహానికి హాజరై తిరిగి వెళుతున్నాడు. వేములేటికి చెందిన కొడపగానిపల్లి ఉపసర్పంచ్ చెరువుకోళ్ల నాగరాజు(48) పని నిమిత్తం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌లో కొత్తచెరువుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని మైలేపల్లి వద్దకు రాగానే రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగరాజు కాలు పూర్తిగా విరిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన మంజునాథ్‌ను 108లో కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ మంజునాథ్‌ను పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ మారుతీశంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నాగరాజుకు భార్య రామాంజినమ్మ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మంజునాథ్ కుంకాలు అమ్ముకుంటూ తల్లిదండ్రులు సూరమ్మ, గోవిందుకు తోడుగా ఉండేవాడు. మంజునాథ్‌కు వివాహం కాలేదు.

లారీని ఆటో ఢీకొని మరొకరు..


ఎస్ షాకీర్ (ఫైల్)

నల్లచెరువు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన మేరకు.. పాత రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి, ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్. షాకీర్ (39) తీవ్రంగా గాయపడ్డాడు. 108లో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంతో మృతి చెందాడు. కె.పూలకుంటకు చెందిన ఎస్.షాకీర్ ప్రతిరోజూ కూరగాయలు, ఇతర సరుకులు విక్రయిస్తుంటాడు. ఆదివారం ఉదయం కదిరిలో కూరగాయలు కొనుగోలుచేయడానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతుడి భార్య మస్తాన్‌బీ కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటోంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు..


కార్తీక్ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామం వద్ద వేగంగా వెళ్లిన ఓ ద్విచక్ర వాహనం బాలుడిని బలితీసుకుంది. ద్విచక్రవాహనం వేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఆడుకుంటున్న బాలుడిని ఢీ కొనడంతో దుర్మరణం పాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ వీరాంజి, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు కార్తీక్(5) రెండు నెలల క్రితం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరాడు. గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలం వద్ద తల్లిదండ్రులు పనులు చేసుకుంటున్నారు. కార్తీక్ రోడ్డు పక్కన ఆడుకుంటుండగా గ్రామానికి చెందిన యువకుడు శేఖర్ రంగచేడు గ్రామం నుంచి బేలోడుకు ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతూ బాలుడిని ఢీ కొని పది మీటర్ల వరకు ఈడ్చికెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన బాలుడి కుటుంబసభ్యులు, తల్లిదండ్రులు కేకలు వేయగా వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. పసిబాలుడు వాహనం కిందపడి చనిపోతే కనీసం ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడంటూ కుటుంబ సభ్యులు, బంధువులు మూకుమ్మడిగా శేఖర్ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలియగానే రాయదుర్గం సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో గ్రామానికి చేరుకొని బాలుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటరమణ తెలిపారు.

గ్రామంలో బందోబస్తు

బేలోడు గ్రామంలో ఆదివారం బాలుడి ప్రమాద సంఘటన నేపథ్యంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్య, పోలీసు సిబ్బందితో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం గ్రామంలో మొహరం సందర్భంగా దళితులు, వాల్మీకులకు మధ్య గొడవ నేపథ్యంలో అప్పట్లో ఎస్సీలు, వాల్మీకులు 25 మందిపై కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పి వేధించారు. ప్రస్తుతం బాలుడి ప్రమాద సంఘటన ఎస్సీలకు చెందిన యువకుడు బాధితుడు కావడంతో వాల్మీకులు ఆగ్రహంతో దళితులపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తారని ముందు జాగ్రత్తగా పోలీసులు గ్రామంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


బేలోడులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చెస్ పోటీల్లో రన్నరప్‌గా జిల్లా జట్టు



చెస్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక లయన్స్ క్లబ్ చెస్ పోటీల్లో జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. బళ్లారిలో ఆదివారం నిర్వహించిన లయన్స్‌క్లబ్ ఆఫ్ కర్ణాటక చిల్డ్రన్స్ చెస్ టోర్నమెంట్-2025 పోటీల్లో జిల్లాలోని ఏ-1 చెస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో అండర్-16 ఓపెన్ విభాగంలో జొన్నలగడ్డ నితీష్ రన్నరప్‌గా, త్రిపదయు 6వ స్థానంలో, దర్శన్ నీలయ్య 8వ స్థానంలో నిలిచారు. అలాగే అండర్-19 ఓపెన్ విభాగంలో నిహాల్ నయనంజన్ రన్నరప్‌గా, హర్ష వర్ధన్‌రెడ్డి 8వ స్థానంలోను, అండర్-8 విభాగంలో అన్విత్ ప్రథమస్థానంలోను నిలిచారు. ఇక అండర్-11 విభాగంలో జ్యోతింద్రరెడ్డి ప్రథమ స్థానంలో, అండర్-14విభాగంలో హర్ష 3వ స్థానంలో నిలిచారు. యంగెస్ట్ క్రీడాకారులు శ్రీనిక్ రక్షణ్, ధృవేంద్ర ఉమ పతకాలు సాధించి రన్నరప్‌గా ద్వితీయ స్థానం సాధించారు.

ఘనంగా పల్లె ఉమ జయంతి

● ఘాట్ వద్ద నివాళులర్పించిన కుటుంబ సభ్యులు



ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతపురంరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కక్కలపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఆమె ఘాట్ వద్ద కుటుంబసభ్యులైన మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి, మనువడు వియాన్, మనవరాలు వన్స్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వీరితో పాటు పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, బాలాజీ ఎడ్యుకేషన్, పీవీకేకే విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని పలు వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ ఆస్పత్రులల్లో పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

'ఆర్డీటీ పరిరక్షణ అందరి బాధ్యత'

అనంతపురం వైద్యం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు ఎన్నో సేవలందించిన ఆర్డీటీని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి సూచించారు. నగరంలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద ఆదివారం ఆర్డీటీ పరిరక్షణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా సాకేహరి హాజరై ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. జిల్లాలో పేదల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 1969లో ఆర్డీటీని స్థాపించారన్నారు. విదేశాల్లోని దాతల నుంచి విరాళాలు సేకరిస్తూ ఇక్కడి పేదలకు సేవలందిస్తున్నారని తెలిపారు. అయితే విరాళాల సేకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేయడంతో ఆర్డీటీ సేవలు పేదలకు అందకుండా పోతున్నాయని వాపోయారు. ఆర్డీటీని పరిరక్షించుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, కేపీ రాజు, ఆనంద్‌రాజ్, కేవీ సుందరం, సుధాకర్, నరసింహులు, గణేష్, నరేంద్ర, శ్రీధర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీసం వేతనం ఇవ్వాలి: సీఐటీయూ

అనంతపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా 8వ మహాసభకు ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎఫ్ఆర్ఎస్‌ను, లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్‌ను రద్దు చేసి, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అంగన్వాడీల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళల పట్ల లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రామగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమేకలపల్లిలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నట్లు మాదిగ దండోర నాయకులు, బీమ్‌రావు యువజనసంఘం నాయకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. విగ్రహ దాత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్. నారాయణచౌదరి సహకారంతో చేపట్టే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు పరిటాలసునీత, ఎంఎస్‌రాజు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ తదితరులు హాజరవుతారని అన్నారు. దండోర నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

ఉద్యోగుల సంఘం కమిటీ ఎంపిక

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం చెన్నేకొత్తపల్లి తాలూకా కమిటీ ఎంపిక అనంతపురం జిల్లాకేంద్రంలోని జెడ్పీలో ఆదివారం జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా వెంకటాచలపతి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశులు, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా ఆశ, కోశాధికారిగా ఫణికుమార్, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీకాంత్, హసీనాను ఎంపికచేసినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు శ్రీనివాసులు, మల్లికార్జున, విజయభాస్కర్‌రెడ్డి, రంగనాయకులు, హరిబాబు, నియాజ్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ప్రోత్సాహక బహుమతి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన టేబుల్‌టెన్నిస్ జాతీయ క్రీడాకారిణి జ్యోతికి ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి రూ.20వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. జ్యోతి ఇటీవలే టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇందుకు గాను ఆమెకు ఆదివారం వారు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

గార్లదిన్నె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రా మంలో పేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వి వాహానికి ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆర్థికసాయం చేశా రు. రూ. 10వేలను స్థానిక టీడీపీ నాయకుల ద్వారా ఆయన ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య, బీసీసెల్ అధికార ప్రతినిధి గోనుల సుబ్బయ్య, మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేష్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు ఆవుల శ్రీనివాసులు, డెయిరీ వెంకటేష్, ఎస్సీసెల్ కార్యదర్శి బూడిద కిష్ట, నాయకులు పాల్గొన్నారు.

నేరాలపై నిఘా నేత్రం

● ప్రధాన కూడళ్లలో నూతన టెక్నాలజీతో కూడిన సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు
● నేరాలు, ప్రమాదాల నియంత్రణే ధ్యేయంగా పోలీసుశాఖ చర్యలు



అనంతపురం -తాడిపత్రి రహదారి కూడలిలో ఏర్పాటు చేసిన సోలార్ సీసీ కెమెరా

బుక్కరాయసముద్రం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం పోలీసులు నేరాలు, ప్రమాదాలపై నిఘా నేత్రం వేశారు. మండలంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం, గుర్తుతెలియని మృతదేహాలు లభిస్తుండడం, చోరీలు జరుగుతుండడం పోలీసులకు సవాల్‌గా మారాయి. వీటిని నియంత్రించడానికి, నేరస్తులను సులభంగా పట్టుకోవడానికి ప్రధానకూడళ్లలో నూతన టెక్నాలజీతో కూడిన సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నేరాలు, ప్రమాదాలను సాంకేతికత ద్వారా అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

బీకేఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో 35 కాలనీలతో పాటు, జాతీయ రహదారి, అనంతపురం- తాడిపత్రి హైవేతో పాటు 544 డీ అమరావతి హైవే కూడా వస్తుంది. అయితే అనునిత్యం ఈ హైవేల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి రోడ్డు ప్రమాదాలకు కారణాలు తెలుసుకోవడానికి, గుర్తుతెలియని వాహనాలను గుర్తించడానికి పోలీసులు సోలార్ సీసీ కెమెరాలను నూతనంగా ఏర్పాటు చేశారు. నిరంతరం పహారా కాస్తూ.. ఎక్కడ నేరం జరిగినా నమోదు చేసేలా సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలో జాతీయ రహదారిపై ఉన్న వడియంపేట, బీ.కొత్తపల్లి గ్రామాల ప్రధాన కూడళ్లలో, అనంతపురం- తాడిపత్రి రహదారిలో, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, అంబేడ్కర్ కూడలి, సిద్దరాంపురం రూట్, చెరువుకట్ట, నార్పల రహదారి, ఓపెన్‌ఎయిర్ జైలు, రెడ్డిపల్లి, కొర్రపాడు తదితర ప్రాంతాలలో ఇప్పటికే సోలార్ సీసీ కెమెరాలను ప్రజల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేశారు. మండలంలో ఇంకా ప్రధాన స్పాట్లు, రద్దీ ప్రాంతాలు ఉంటే గుర్తించి, అక్కడా సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ప్రజలు, వివిధ వ్యాపార వర్గాలు, ఎన్ఆర్ఐలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసు శాఖ రంగం సిద్ధం చేస్తోంది. ఇక ఇటీవల కాలంలో మండలంలో పలు ఆలయాల్లో చోరీలు జరుగుతుండటంతో దొంగలను గుర్తించేందుకు కష్టంగా మారింది. చోరీకి గురైన ఆభరణాలు రికవరీ చేసేందుకు పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో మండలంలో ప్రధానంగా దాదాపు 35 ఆలయాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే ఆలయాల కమిటీలతో పోలీసు శాఖ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సహకారంతో సాంకేతిక కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిసింది.

నేరస్తులు తప్పించుకోకూడదనే..



మండలంలో నేరాలకు పాల్పడిన వారు తప్పించుకోకూడదనే ఉద్దేశ్యంతోనే ప్రధాన కూడళ్లలో సాంకేతిక సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. నేరాలకు పాల్పడిన వారికోసమే కాకుండా.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాటికి కారణమైన వాహనాలను సులభంగా గుర్తించేందు కు వీలుంటుంది. వీటితో పాటు ఆలయాల్లో చోరీల నియంత్రణకు ప్రతి ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

-సీఐ పుల్లన్న

టీడీపీ నాయకుల మృతికి నివాళి



పీఆర్ కొట్టాలలో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



సిద్దరాంపురంలో నివాళులర్పిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి ఇతర నాయకులు

రామగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్ కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బండారు చిన్నసుబ్బరాయుడు(80) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత కుటుంబసభ్యులను ఓదార్చారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

● బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురం ఎంపీటీసీ సభ్యురాలు నాగలక్ష్మి భర్త, టీడీపీ నాయకుడు బండారు నాగేంద్ర (50) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, మండల కన్వీనర్ అశోక్, సహకార సొసైటీ చైర్మన్ కేశన్న గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాయకులు లక్ష్మీనారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి



మోహన్(ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలకేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త బన్యాల మోహన్(40)అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో కొద్దిరోజుల క్రితం అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూమృతిచెందినట్లు స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. మృతుడికి భార్యమల్లేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టీడీపీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పశువుల సంత ఆదాయం రూ.2.67 లక్షలు

అనంతపురం రూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన పశువుల సంత ద్వారా రూ.2.67 లక్షల ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.52 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.15 లక్షలు మార్కెట్‌కు ఆదాయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

గార్లదిన్నె, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని 44వ జాతీయ రహదారిపై కూడలి వద్ద కంటైనర్‌లారీని కారు ఢీ కొంది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాలేదు. మహారాష్ట్రకు చెందిన కంటైనర్ లారీ హైదరాబాద్ వైపు వెళుతోంది. అనంతపురానికి చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి కారులో గుత్తి వైపు బయలుదేరాడు. అయితే కల్లూరులో జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ల వద్ద ముందు వెళుతున్న కంటైనర్‌ను ఆ కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో వారందరూ పెనుప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై రాకపోకలకు ఎలాంటి అంతరాయ ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వేధింపుల కేసులో ఒకరికి రిమాండ్

అనంతపురం క్రైం, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించి, హత్యాయత్నం చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... కర్నూలుకు చెందిన తస్లిమా, ధర్మవరానికి చెందిన రోషన్ జమీర్ కు గతంలో వివాహమైంది. అయితే కొంత కాలం తర్వాత వారు విడాకులు పొందారు. వీరికి పిల్లలు లేరు. తర్వాత ఆ ఇద్దరూ మళ్లీ పెళ్లి చేసుకుని నగరంలోని మున్నానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల చిన్నపాటి మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఈ నెల 15న భార్యను భర్త కొట్టడమే కాకుండా మాత్రలు కలిపిన నీళ్ల బలవంతంగా తాపినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. విచారణ చేసిన పోలీసులు ఐదుగురిపై కేసు నమోదుచేశారు. భర్త రోషన్‌జమీర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

కనగానపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ కులు గాయపడ్డారు. రాప్తాడు మండలం పాలవాయికి చెందిన రాజా, యువరాజు ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లి నాలుగు రోడ్ల కూడలి దాటుతున్నారు. ఇదే సమయంలో ధర్మవరం నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం వారి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రాజా, యువరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 ద్వారా అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

'శ్రీకృష్ణుడి అవతారం మహోన్నతమైనది'



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి శారద సిస్టర్



జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న రామగిరి వాసులు

అనంతపురం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి అవతారం ఎంతో మహోన్నతమైందని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అనంతపురం శాఖ ఇన్‌చార్జి శారద సిస్టర్ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శారద సిస్టర్ మాట్లాడుతూ... శ్రీకృష్ణుడి అవతారం మహోన్నతమైనదని, భగవద్గీతలో ఆయన చేసిన బోధనల్లో ధర్మం, ఖర్మ, జ్ఞానం, భక్తి అన్నీ ఉన్నాయని అన్నారు. ఇవి జీవితాన్ని మెరుగుపరచడానికి, జీవితంలో ఎదురయ్యే అనేక రకాల సమస్యలకు పరిష్కారాలను సూచిస్తాయని తెలిపారు. అనంతరం నిర్వహించిన సంబరాల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించారు. తదనంతరం చిన్నారులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో పీటీసీ యోగా గురువు మురళీకృష్ణ, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: మండల కేంద్రంలో యాదవ సోదరులు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులను ఊరేగింపు చేసి శ్రీకృష్ణుడి చిత్రపటం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం సాయంత్రం శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఆనందోత్సాహాలతో ఊరేగించారు.

'వికలాంగ పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారం'



మాట్లాడుతున్న గడిపూటి నారాయణస్వామి

అనంతపురం క్రైం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వికలాంగ పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని వికలాంగులు, వృద్ధ పౌరుల సహాయ కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి మండిపడ్డారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి నారాలోకేష్‌కు, బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. వికలాంగ పింఛన్లపై వైసీపీ మూకలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో అనర్హులకు కూడా పింఛన్లు అందించి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అనర్హులను గుర్తించి తొలగించిందన్నారు. ఆ నిధులతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. వైసీపీ మూకలు దుష్ప్రచారం చేస్తే... వికలాంగులు ఎవరూ సహించరని, ఖబడ్దార్ అంటూ ఆయన హెచ్చరించారు.

మళ్లీ పందుల బెడద

● నగరంలోని ప్రధాన రహదారుల్లో స్వైరవిహారం
● ఆందోళనలో ప్రజలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో పందుల బెడద మళ్లీ మొదలైంది. ప్రధానంగా సుభాష్‌రోడ్డు, కమలానగర్, ఆదిమూర్తినగర్, గుల్జార్‌పేట, నడిమివంక, కృపానందనగర్ తదితర ఏరియాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లల్లో, నివాసాల మధ్యన గుంపులుగా సంచరిస్తున్నాయి. నగరంలో పం దుల బెడద మళ్లీ మొదలైందని నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కుక్కలు, ఆవులతో బెంబేలెత్తిపోతున్న జనాలకు పందుల సంచారం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు నగరంలో చెత్త సేకరణ, మురుగు కాలవల నిర్వహణ లోపించడమేనని ప్రజలు వాపోతున్నారు. టవర్‌క్లాక్ నుంచి సప్తగిరిసర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారి గల సుభాష్‌రోడ్డులో సైతం చెత్తకుప్పలు, మురుగు పేరుకుపోవడంతో పందులు స్థావరాలు ఏర్పరచుకున్నాయి. చెత్త, మురుగు వల్ల దోమలు కూడా విజృంభిస్తున్నాయి. అంతేకాకుండా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. వాటి వల్ల రోగాల భారిన పడుతున్నామని అంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చెత్త, మురుగును తొలగించాలని, పందుల సంచారాన్ని అరికట్టాలని వారు కోరుతున్నారు.





నడిమివంకలోని మూడో రోడ్డు, కృపానందనగర్‌లో రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న పందులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

రాప్తాడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. అదే పాఠశాలలో 2000-2001వ విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తర్వాత నాటి గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

తపోవనం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో తిక్క రంగయ్యస్వామి ఆలయం నుంచి తపోవనం వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన పార్టీశ్రేణులతో కలిసి తపోవనం రోడ్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తపోవనం రోడ్డును మరమ్మతు చేయడంతో పాటు రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద కొత్త బ్రిడ్జి, నడిమివంకకు సైడ్‌వాల్ నిర్మించాలని కోరుతూ సోమవారం నుంచి 20వ తేదీ వరకు శాంతినగర్ సర్కిల్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల బ్రతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన చెందారు. నగరంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలమంగా దర్శనమిస్తున్నాయన్నారు. రోడ్లను బాగు చేయాలని నగరపాలక అధికారులకు ఎన్నిమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. నాయకులు వెంకటనారాయణ, వలి, రాజు, జీవ, గఫూర్, ఇస్మాయిల్, రాయుడు, మునలప్ప, వీరన్న, రామాంజనేయులు, పాల్ జైకర్, సలీం, సుబహాన్ పాల్గొన్నారు.

'సంఘాలను చర్చలకు పిలవాలి'

అనంతపురం విద్య ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై చర్చించడానికి ప్రభుత్వం ఈ నెల20వ తేదీన నిర్వహిస్తున్న చర్చలకు రిజిస్టర్ సంఘాలను ఆహ్వానించాలని ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై చర్చించడానికి సర్కారు ముందుకు రావడం ఆనందదాయకమేనన్నారు. ఈ చర్చలకు కేవలం గుర్తింపు సంఘాలనే ఆహ్వానించి రిజిస్టర్ సంఘాలను పిలవకపోవడం అన్యాయమన్నారు. అందుకే చర్చలకు రిజిస్టర్ సంఘాలను పిలిచి ఉద్యోగసంఘాలపై వివక్షత లేకుండా చూడాలని కోరారు.

ఘనంగా మిత్ర ఆస్పత్రి ప్రారంభం



డాక్టర్ కృష్ణ సౌమ్యరెడ్డిని అభినందిస్తున్న వైద్యురాలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయి నగర్‌లో మొదటి క్రాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మిత్ర ఈఎన్‌టీ ఆస్పత్రిని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ పీ. కృష్ణసౌమ్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు సమస్యలతో పాటు అలర్జీ, తల తిరుగుడు వంటి వాటితో బాధ పడుతున్న వారికి అత్యాధునిక వైద్యం ఈ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. బెంగళూరు నారాయణ హృదయాలయ, కిమ్స్ సవీరాతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేసిన అనుభవమున్న వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ సేవలను జిల్లా ప్రజలకు అందించాలన్న ఆకాంక్షతో మిత్ర ఈఎన్‌టీ హాస్పిటల్, ఈఎన్‌టీ, అలర్జీ అండ్ వర్టిగో సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ప్రముఖ వైద్యులు శ్రీనాథ్, లత, ప్రవీణ్, కిరణ్‌కుమార్ తదితరులు డాక్టర్ కృష్ణ సౌమ్య రెడ్డిని అభినందించారు.

'సదరం రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు'

శింగనమల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సదరం రీవెరిఫికేషన్‌లో పలు కారణాలతో సర్టిఫికెట్లు తిరస్కరణకు గురైన వికలాంగ పింఛన్‌దారులు మరోసారి రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఎంపీడీఓ భాస్కర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటికే సదరం రీవెరిఫికేషన్ పూర్తి కాగా.. కొందరు వికలాంగుల సర్టిఫికెట్లు తిరస్కరణకు గురవడంతో వారు పింఛన్‌కు అర్హత సాధించలేకపోయారు. ఈనెల 14 నుంచి 25వతేదీలోపు మళ్లీ సదరం రీవెరిఫికేషన్‌కు నోటీసులు పంపుతామని, తిరస్కరణ అయిన వారు పాత సదరం సర్టిఫికెట్‌తో పాటు అధికారులు జారీ చేసిన నోటీస్‌లతో సంబంధింత ఏరియా ఆసుపత్రి వద్ద మరలా రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత ఉండి సర్టిఫికెట్ తిరస్కరణ ఉన్న దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

21న దివ్యాంగుల ధర్నా

అనంతపురం అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలనలో తొలగించిన అర్హులైన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వతేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ దివ్యాంగుల హక్కు పోరాట సమితి ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ పోటీల్లో అనంతకు వరుస విజయాలు



అర్షియా



నేహా

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం వరుస విజయాలు నమోదు చేసింది. ఆదివారం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. వర్షం కారణంగా మ్యాచ్‌లను కుదించారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 21 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 140 పరుగులు చేసింది. అర్షియా 69, నేహా 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బరిలోకి దిగిన కడప జట్టు 21 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 102 పరుగులు మాత్రమే చేసింది. దీంతో అనంతపురం జట్టు 38 పరుగులతో తేడాతో విజయం సాధించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన చిత్తూరు, కర్నూలు మధ్య జట్ల పోరులో...మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు 24 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 114 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 24.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 86 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సెలెక్షన్ కమిటీ చైర్‌పర్సన్ సల్మాభాను, సెలెక్టర్ ధనలక్ష్మి, రాధిక, వేదవల్లి, నాగమణి, అనూష, హరీషా, మాజీ సెక్రటరీ రామలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్లు

● లక్షలు వెచ్చించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు ● పట్టించుకోని పాలకులు, అధికారులు




కలుగోడు, గోనబావిలో మూతపడిన వాటర్ ప్లాంట్లు

గుమ్మఘట్ట, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధినీటి జలాల ప్లాంట్లు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో గ్రామీణులు స్వచ్ఛమైన తాగునీరు లేక ఉప్పు, కలుషిత, ఫ్లోరైడ్ నీటిని తాగుతూ విరేచనాలు, విషజ్వరాలు, కీళ్ల నొప్పులు తదితర వాటిన బారిపడేవారు. ఆ గ్రామీణ ప్రాంతాల ప్రజలను కాపాడేందుకు 2018లో పార్లమెంట్ సభ్యులు నిధులు.. జిల్లా పరిషత్ నిధులతో ఒక్కో ప్లాంట్‌ను రూ.8 లక్షలతో నాటి టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. రెండు రూపాయలకే 15 లీటర్ల శుద్ధి జలాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఈ ప్లాంట్లను సక్రమంగా నిర్వహిస్తూ.. ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించి ప్రజలకు శుద్ధిజలాలను అందించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాలకులు, అధికారులు శుద్ధిజలాల ప్లాంట్ల నిర్వహణను గాలికి వదిలేశారు. వారి అలసత్వం కారణంగా అవి మూతపడి నిరుపయోగంగా మారాయి. కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని... మరమ్మతులకు నోచుకోక మరికొన్ని మూతపడ్డాయి. మండలంలోని గోనబావి, కలుగోడు, పూలకుంట తదితర గ్రామాల్లో శుద్ధిజలాల ప్లాంట్లు మరమ్మతులకు గురై... కరెంటు బిల్లులు చెల్లింక మూతపడ్డాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ వ్యక్తుల నుంచి శుద్ధిజలాలను అధిక ధరలు వెచ్చించి.. కొనుగోలు చేస్తున్నారు.

వినియోగంలోకి తెస్తాం

గ్రామాల్లో శుద్ధిజలాల ప్లాంట్లను ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. మూతపడ్డ శుద్ధిజలాల ప్లాంట్లను మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటికే ఆయా పంచాయతీ సర్పంచులకు ఆదేశించాం. త్వరలో శుద్ధిజలాల ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

-ప్రణీత, ఆర్‌డబ్ల్యుఎస్, ఏఈ

అధ్వానంగా యాడికి-బుగ్గ రోడ్డు

ప్రమాదాల్లో గాయపడుతున్న ద్విచక్రవాహనదారులు




తిరుణాంపల్లి వద్ద, యాడికి వద్ద గుంతలమయమైన రోడ్లు

యాడికి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): యాడికి నుంచి బుగ్గకు వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలు ఉండటంతో.. వాహనాలు ఎటువైపు వెళ్లాలో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. యాడికి గ్రామశివారులో, తిరుణాంపల్లి వద్ద, చిక్కేపల్లి వద్ద, నిట్టూరు వద్ద రోడ్డుపై ఉన్న పెద్దపెద్ద గుంతల్లో వర్షపునీరు నిలిచి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పాలకులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో మరీ అధ్వానంగా రోడ్డు మారింది. ఈ రోడ్డుపై అనేక మంది ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. అధికారులు స్పందించి.. ఈ రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విలువల జీవితంతోనే గుర్తింపు

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న విప్



సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన జీవన విధానాన్ని అనుసరించినపుడే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని డ్వామా హాల్‌లో కెరె జగదీష్ స్మారక వేదికపై ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ పతాకాన్ని విప్ ఆవిష్కరించారు. జర్నలిజం వృత్తిలో సుదీర్ఘ కాలం సేవలను అందించిన 15 మందిని సన్మానించారు. అలాగే 80 మంది జర్నలిస్టు కుటుంబాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన జర్నలిస్ట్ పరమేశ్వరప్ప కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం విప్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యతలను ఎప్పటికప్పుడు గుర్తు చేయడం జర్నలిస్టుల కర్తవ్యమన్నారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణకు ప్రభుత్వస్థాయిలో ఉండే కమిటీని పునరుద్ధరించేలా హోంమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ అయూబ్, గౌరవ అధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, యూనియన్ ఉపాధ్యక్షులు లింగప్రసాద్, కౌన్సిల్ సభ్యులు చలపతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

తాడిపత్రి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004-2007 వరకు చదివిన విద్యార్థులు ఆదివారం అదే కళాశాలలో సమావేశమయ్యారు. ఇతర దేశాలు, రాష్ట్రాలు, జిల్లాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. నాటి అధ్యాపకులు విశ్వనాథ్, నరసింహులు, సూర్యభార్గవ్, భాను ప్రకాష్, మురళీరాజు, చక్రవర్తిని ఆహ్వానించి.. ఘనంగా సన్మానించారు. ఇందులో పూర్వ విద్యార్థులు ప్రతాప్‌రెడ్డి, వెంకట్, జయశంకర్ రెడ్డి, నాగరంగేష్, ఓబులేసు పాల్గొన్నారు.



కాలువ నీటికి పూజ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

యాడికి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు యాడికి కాలువ వర్షం నీటితో ప్రవహిస్తోంది. దీంతో ఆదివారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి రైతులు, టీడీపీ నాయకులు కాలువ నీటికి జలపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే యాడికి ప్రభుత్వ వైద్యశాలలో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని పీఆర్ డీఈ యల్లమనాయుడును ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, బొట్టు శేఖర్, విశ్వనాథ్ ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి: గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

గుత్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలు సమాజ ప్రగతికి అవరోధంగా ఉన్నాయని, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని జేవీవీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో ఆదివారం జేవీవీ 18వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్‌తో పాటు రాష్ట్ర నాయకులు డాక్టర్ తరిమెల అమర్నాథ్‌రెడ్డి, రామాంజనేయులు, ఆదిశేషు, తదితరులు మాట్లాడుతూ.. కొందరు రాజకీయ నాయకులు సనాతన ధర్మం పేరుతో ప్రజల్లో మూఢ నమ్మకాలు అశాస్త్ర విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం పరిచారు. ఆర్టీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి, సత్యనారాయణ, సాకే భాస్కర్, డాక్టర్ రంగన్న, గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతి, మురళీధర్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మహ్మద్ జిలాన్, రంగనాథ్, సీతానంద, శ్రీధర్ గౌడ్, దేశాయ్ నాగరాజు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి ప్రతిమను ఆదివారం ఊరేగించారు. గ్రామంలో కొలువుదీర్చిన శ్రీకృష్ణుడి విగ్రహానికి నిత్య పూజలు చేశారు. భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. అనంతరం స్వామి ప్రతిమను పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆ కమిటీ అధ్యక్షుడు తిప్పారెడ్డి, సభ్యులు శివకృష్ణ, చంద్రశేఖర్ గౌడ్, సుబ్బయ్య, సంజీవరాయుడు పాల్గొన్నారు.

● కుందుర్పి: మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజైన ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిజవల్లి, కదరంపల్లి, బెస్తరపల్లి, వడ్డీపాల్యం, కరిగానిపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

● బ్రహ్మసముద్రం : మండలంలోని చెలిమేపల్లి, అజ్జయ్య దొడ్డి, కపటలింగనపల్లి, పొబ్బర్లపల్లి, ఎరడికెర, బ్రహ్మసముద్రం, పాలవెంకటాపురం తదితర గ్రామాల్లో యాదవులు ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మండపాలు నిర్మించి.. కృష్ణుడి విగ్రహాలను పెట్టి పూజలు నిర్వహించారు.

● బొమ్మనహాళ్ : లింగదహాల్‌లో ఆదివారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాల్లో శ్రీ కృష్ణ చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు.




గుంతకల్లు, లింగదహాళ్‌లో శ్రీకృష్ణుడి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

కార్యకర్తలకు పరామర్శ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం, నల్లదాసరిపల్లి గ్రామాల్లో అనారోగ్యాలతో బాధపడుతున్న టీడీపీ నాయకులను ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ ఆదివారం పరామర్శించారు. తిమ్మాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఈడిగ రాముడును పరామర్శించారు. అలాగే నల్లదాసరిపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న రాజశేఖర్‌రెడ్డి మాతృమూర్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను టీడీపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సుంకప్ప, శ్రీరాములుగౌడ్, పార్లమెంట్ మహిళా కార్యదర్శి బండిలక్ష్మీదేవి ఉన్నారు.

రిజర్వాయర్‌లో 1.790 టీఎంసీల నీరు

బెళుగుప్ప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుత 1.790 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ఇన్‌ఫ్లో 2,130 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,090 క్యూసెక్కులు ఉన్నట్లు వెల్లడించారు.

ఉపాధి బిల్లుల కోసం నిరీక్షణ

శెట్టూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లుల కోసం కూలీలు ఎదురుచూస్తున్నారు. 12 వారాల నుంచి కూలిని (బిల్లులు) ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో.. తమ కుటుంబ పోషణ భారమైందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులకు వెళ్తే.. సాయంత్రానికి కూలి సొమ్ము అందజేస్తారని, ప్రభుత్వం మాత్రం మూడు నెలలైనా కూలి సొమ్ము ఇవ్వలేదని వాపోతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు రూ. కోటి వరకు కూలి సొమ్ము అందాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తమకు సకాలంలో కూలి అందేలా చూడాలని కోరుతున్నారు.

మున్సిపల్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



కమిటీ నూతన సభ్యులు, కార్మికులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు అనుబంధం) నూతన కమిటీని 13 మందితో ఆదివారం ఎన్నుకున్నారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షురాలిగా దుర్గమ్మ, కార్యదర్శిగా వన్నూరుస్వామి, ట్రెజరర్‌గా జే రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప, రమణ, సహాయ కార్యదర్శులుగా నటరాజు, శివకుమార్, మరో ఆరుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, కమిటీ సభ్యులు అలివేలమ్మ, యల్లక్క, సరస్వతి, ప్రకాష్, వన్నూరుస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఫేజ్-2కు కృష్ణాజలాల విడుదల

బెళుగుప్ప, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2కు ఆదివారం నుంచి 200 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. హంద్రీనీవా సీఈ నాగరాజు, ఎస్ఈ రాజ్‌స్వరూప్, అధికారులు జల పూజ చేసి, వాయనం సమర్పించి.. నీటిని విడుదల చేశారు.



కృష్ణాజలాలకు వాయనం సమర్పిస్తున్న అధికారులు

నిజాయతీ చాటుకున్న హెడ్ కానిస్టేబుల్



గణేష్‌కు పర్స్ అందజేస్తున్న మున్వర్

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బాబా మున్వర్ నిజాయతీ చాటుకున్నారు. కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ కేఎస్ గణేష్ స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పర్స్‌ను పోగొట్టుకున్నాడు. బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న టూటౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బా బా మున్వర్‌కు ఆ పర్స్ దొరికింది. అందులో రూ. 6వేలు, ఐడీ కార్డు ఉన్నట్లు గుర్తించాడు. చిప్పగిరిలో తెలిసిన వారికి ఫోన్ చేసి జవాన్ గణేష్ సెల్ నెంబర్ తీసుకుని అతనికి ఫోన్ చేసి గుంతకల్లు బస్టాండ్ పిలిపించాడు. గణేష్‌కు ఆ పర్సును అందజేశాడు.

నెట్టికంటికి కిలో వెండి ..



వెండిని అందజేస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామికి ఆదివారం పట్టణానికి చెందిన భక్తులు కిలో వెండిని అందజేశారు. పట్టణానికి చెందిన ఈశ్వరమ్మ కు మారులు శ్రీనివాస్‌బాబు, గణేష్‌బాబు, వి.వాసు ఆలయ అధికారులకు వెండిని అందజేశారు. వీరికి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పనుల పరిశీలన

తాడిపత్రి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని అనంతపురం రహదారి ఫ్లైఓవర్ వద్ద శ్రీ ధ్యాన శివు ని విగ్రహ ఆవిష్కరణ పనులను ము న్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

శివన్నకు ఘన నివాళి

ఉరవకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ నేత శివన్న ఇటీవల మరణించగా.. ఆయన సంస్మరణ సభను స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, నాయకులు మల్లికార్జున, కేశవరెడ్డి, నాగేంద్ర, రసూల్, సుల్తాన్, బండయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరం

తాడిపత్రి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మిలాదున్నబీ పండుగ పురస్కరించుకొని స్థానిక షాదీఖానాలో ఈద్‌మిలాదున్నబీ కమిటీ ఆధ్వర్యంలో ఈఎన్‌టీ వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి హాజరయ్యారు. ఈ శిబిరంలో 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

క్రైం న్యూస్..

రస్తా విషయంలో ఘర్షణ

గుత్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమృత్ థియేటర్ వెనుక వైపు ఉన్న ఎస్సీ కాలనీలో ఆదివారం రస్తా విషయంలో ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారు. సోదరులు రాజా, రామాంజినేయులపై పక్కీరప్ప, చరణ్, పవన్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కుందుర్పి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అపిలేపల్లిలో శనివారం అర్ధరాత్రి చెరువులో విద్యుత్ స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి.. అందులోని రాగివైర్‌ను ఎత్తుకెళ్లారు. మండలంలో ఏదో ఒక చోట సూక్ష్మ నీటి బిందు పరికరాలు, స్టార్టర్లు, మోటార్ పంపు సెట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ సప్లై కేబుల్ వైరు, డిప్ వైర్లను దుండగులు చోరీ చేయడం పరిపాటిగా మారిందని అపిలేపల్లికి చెందిన బాధిత రైతులు ధనుంజయ, అనిత, హనుమంతరాయుడు, నీలమ్మ, కే తిప్పేస్వామి, మంజు, శివలింగమూర్తి వాపోయారు. దీనిపై కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ దొంగతనాలను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

బొమ్మనహాళ్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కల్లుదేవనహళ్లి గ్రామానికి చెందిన తిప్పన్న గాయపడ్డాడు. ఇతను పొలం పనులు చూసుకొని ఇంటికి బైక్‌పై వస్తుండగా.. కల్లుహోళ్ల గ్రామానికి చెందిన హరిష్ బైక్‌పై వస్తూ ఢీకొన్నాడు. ప్రమాదంలో తిప్పన తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతన్ని వెంటనే బళ్లారి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యూరియా కోసం ఆందోళన



వర్షంలోనూ ఆందోళన నిర్వహిస్తున్న ఉద్దేహాళ్ రైతులు

బొమ్మనహాళ్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్‌లోని రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ఆదివారం వర్షంలోనూ తడుస్తూ... ఆందోళన చేపట్టారు. రైతుకు కనీసం 10 బస్తాలైనా ఇవ్వాలని.. రెండు బస్తాలు ఎక్కడ సరిపోతాయని అధికారులను నిలదీశారు. సొసైటీలకు ఇవ్వకుండా కేవలం రైతు సేవా కేంద్రానికి మాత్రమే ఇస్తుండటంపై రైతులు మండిపడ్డారు. ప్రస్తుతం నాట్లు వేసి 15 రోజులు దాటినా.. పైరుకు యూరియా మొదటి దశలో కూడా వేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయాధికారులు మాట్లాడుతూ.. యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మరింత యూరియా త్వరలో వస్తుందని.. అందరికి ఇస్తామన్నారు. ఇప్పటివరకు 75.6 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వచ్చినట్లు ఏఓ సాయికుమార్ తెలిపారు.

రోడ్డు బాగు చేయరూ..!



బురదమయమైన సంగమేశ్వర స్వామి ఆలయ రోడ్డు

కూడేరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి సంగమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వాన పడినా బురదమయంగా మారుతోంది. తప్పనిపరిస్థితుల్లో ఈ రోడ్డుపైనే వందలాది మంది నడిచివెళ్తుంటారు. వారిలో అనేక మంది జారి పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎనిమిది గంటల్లో పదెకరాల్లో గుంటక పాసిన రైతు



నరసింహులును అభినందిస్తున్న గ్రామస్థులు

ఉరవకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంద్రావతి గ్రామంలో మల్లికార్జునకు చెందిన పది ఎకరాల వేరుశనగ పొలంలో నరసింహులు ఎనిమిది గంటల్లో గుంటక పాసి రికార్డు సృష్టించాడు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు గుంటకను పాసేది మొదలుపెట్టి మధ్యాహ్నం రెండు గంటలకు ముగించాడు. దీంతో నరసింహులును మాజీ సర్పంచ్ వెంకటేశులు, రైతులు బసవరాజు, వెంకటేశ్, వన్నూర్‌స్వామి అభినందించారు.

రోడ్లపై పశువుల సంచారం

కూడేరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన జోడులింగాల సంగమేశ్వరస్వామి పేరుతో కొందరు భక్తులు వదిలిన పశువులు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. మండల కేంద్రంలో ఈ పశువుల గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో వీధిలైట్లు లేకపోవడం.. రాత్రి సమయంలో రోడ్లపై పశువులు తిరుగుతుండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.



రాత్రి వేళ రోడ్డుపై తిరుగుతున్న పశువులు